# అమ్మ

రమాపూర్ణిమ

కథ

"కృతీ! అమ్మా కృతీ!" రెండుసార్లు పిలిచాను- పలకలేదు. అర్ధరాత్రి పన్నెండైంది- అప్పుడు లేపకూడదని తెలుసు- కానీ తప్పదు- ఒకటికొస్తోంది, లేవలేను- కర్ర ఎక్కడ పెట్టానో కనిపించటంలేదు- అసలే కళ్లు మసక- ఆపై చీకటి- మనవరాలు పసిపాపతో తంటాలు పడిపడి ఇప్పుడే కునుకు తీస్తోంది. పక్క తడిపేస్తే- మర్నాడు ఒకటికి పదింతలు పని పడుతుంది అమ్మాయికి- లాభంలేదు- ఈ మారు గట్టిగానైనా పిలవాల్సిందే మరి. తప్పదు. "కృతీ!... పూడ్చుకుపోయిన గొంతునంతా కూడదీసుకుని గట్టిగానే పిలిచాను.

"ఆc...! బదులొచ్చింది.

అటునుంచి కృతి, ఇటునుంచి మనవరాలు మైత్రి ఇద్దరూ వచ్చారు!

"ఆ! ఏంటి? ఇప్పుడేకదా పండురసం ఇచ్చి పడుకోడానికెళ్లాను- మళ్లీ ఏం కొంప మునిగిందని- అరుపులు!" కృతి అందుకుంది.

"అమ్మమ్మా! ఇంక పడుకోనివ్వవా! అమ్మ! పొద్దస్తమానూ నీ చాకిరి చెయ్యలేక చస్తోంది- ఓ నాలుగ్గంటలు పిలవకుండా ఉంటే మళ్లీ రేపు నీ డ్యూటీ చెయ్యగలుగుతుంది" కర్రుందికదా-వెళ్లొచ్చుకదా! అంటూ మైత్రి."

ఏం సమాధానం చెప్పలేకపోయాను! లేకనో, చెప్పలేకనో కాదు, ఏదీ చెప్పాలని మనసు రాక- మనసైనవారనే నమ్మకం వొమ్మవడాన్ని జీర్ణించుకోలేక గొంతు మళ్లీ పూడుకుపోయింది".

కృతి రెక్క పట్టుకుని కమోడ్‌పై కూర్చోపెట్టింది- పది నిమిషాలు ఎటో మొహంపెట్టి నిల్చుంది.

"వచ్చిందా! అయిందా!" అని ప్రశ్న!

ఆ ప్రశ్నతో మళ్లీ లోకంలోకొచ్చాను!

గుండెదడ-బాధల్లో అదెప్పుడో ఆగిపోయింది-రాలేదు!

"ప్రతి గంటకు లేవడం నీకు ఆనవాయితీ అయిపోయింది" అంతే ఒకటికి రాదు- ఏమీ కాదు" అనేసింది మైత్రి!.

కళ్లు! చెమ్మగిల్లాయి- మెల్లగా మంచాన్ని పట్టుకుని కూర్చున్నాను- ఈ మైత్రేనా ఆ మైత్రి! అనిపించిందొక్కసారి! కళ్లు మూసుకున్నాను- గతమంతా కళ్లముందున్నట్లనిపించింది!

అమ్మా! మీ అల్లుడికి, నాకు టైం వీలవ్వటం లేదమ్మా! క్రెచ్‌లో వేయడం నాకు ఇష్టం లేదమ్మా! మా పాపని నువ్వే ఓ ఐదేళ్లపాటు పెంచాలమ్మా! తప్పదు- నువ్వీ బాధ్యత మోయాల్సిందే! తప్పదు- అంటూ తొమ్మిది నెలల పసిగుడ్డును నా చేతిలో పెట్టి ఢిల్లీ వెళ్లిపోయింది కృతి! తల్లిపాల అలవాటున్న మైత్రి రాత్రంతా పాలకోసం మారాం చేసినపుడు పాలురాని నా రొమ్ము తన నోటిలో పెట్టి పక్కనుండి సీసాపాలు పట్టి పెంచుకున్న నా చిట్టితల్లి మైత్రి!


బాధ్యతలు నెరవేరి హాయిగా లైఫ్‌ని తీర్థయాత్రలతో ఎంజాయ్ చేసే యాభై ఏళ్ల వయసులో నేను మళ్లీ తల్లి పాత్ర పోషించడం... మైత్రి స్కూలు వ్యాను కోసం, డ్యాన్స్ క్లాసు ఎదురుగా, స్కేటింగ్ స్టేడియం ఎదురుగా, ప్రతి సండే స్విమ్మింగ్‌పూల్ ఎదురుగా- ఇలా ఎన్ని పడిగాపులు- ఎదురుచూపులు- మైత్రి ఎగ్జామ్స్ అన్నీ నేను మేలుకొని వుండాల్సిందే! గంట గంటకీ బోర్న్‌విటా ఇస్తూ, నేనూ టీ తాగుతూ ఎన్ని జాగరణలు! ఏంచేయను! ముసలయ్యాక గంట గంటకీ కడుపు ఉబ్బిపోయినట్టే ఉంటుంది- ఒక్కోసారి ఒకటికి వస్తుంది- ఒకోసారి రాదు- నరాల సత్తువ లేనపుడు ప్రతీదీ తెలీకుండానే జరిగిపోతున్నాయి! పక్క తడిసిపోయింది- చీరంతా తడిముద్ద! ఏంచేయను- మార్చుకోలేను, లేవలేను- పోనీ లేపనా!

అమ్మో! ఇప్పుడే అయింది రాద్ధాంతం- మళ్లీ విని తట్టుకునే ఓపిక ఈ ఎనభై ఐదేళ్ల ముసలమ్మకి లేదు- ఏంచేయను ఆ తడినుంచి కొద్దిగా ఓరవాకగా వాలాను- అయినా తడే- నాకు తడిబట్టలతో నిద్రరాదు!

కృతికి ఏడేళ్లవరకు పక్కతడిపే అలవాటు పోలేదు- ప్రతిరాత్రి అటుమలు పడుకునే ముందు ఇచ్చేదాన్ని. అయినా అలవాటు పోలేదు. రాత్రి లేపి బాత్రూమ్‌కి తీసుకెళ్లినా పోసేది కాదు- మరో క్షణంలోనే బట్టలన్నీ తడిపేసేది. నా బంగారుకొంఠ నా మీదే పడుకునేది- నా చీరలు, స్వెట్టర్లు, రజాయ్‌లు అన్నీ... బొంత మీద పడుకోపెట్టు అనేవారు వాళ్ల నాన్నగారు- నేను వినేదాన్ని కానీ ఆచరించేదాన్ని కాదు- ఒక్క క్షణం నా తల్లి నా నుంచి దూరమవడమే!

** ** **

కడుపు ఖాళీ అయిందేమో! కడుపులో పేగులు పీకుతున్నట్టుగా ఉంది- గ్లూకోజు నీళ్లు తాగితే కాస్త సర్దుకుంటుంది- అమ్మయ్య! కర్ర చేతికొందింది- మెల్లగా లేచాను గ్లూకోజు కలుపుకున్నాక గ్లాసు చేయి జారిపోయింది- నీళ్లు కిందపడ్డాయి- గణ గణ గణ గ్లాసుమోత మళ్లీ ఇద్దరూ వచ్చారు. "ఏమంటారో అని కళ్లు మూసుకున్నాను"- కానీ ఈ నెపంతోనైనా ఇద్దరూ నా దగ్గరకి వచ్చారని సంతోషమై- చూడాలని మూసిన కళ్లు తెరిచాను.



శ్రీకాకుళం

ఇప్పుడేంటి?

"అమ్మని పడుకోనివ్వవా"

"ఆకలేసి...!"

"ఆకలిని ఓ నాలుగ్గంటలు ఓర్చుకోలేవా?" అంటూ మైత్రి!

దాన్ని కొనసాగిస్తూ కృతి... "నువ్వూరుకో- ఆవిడకేమి మహారాణీ! ఏదీ ఓర్చుకోలేరు...! నేనున్నాగా- నే చూసుకుంటాను- నువ్వెళ్లి పడుకో! అంది మైత్రిని నెట్టుతూ.

"నీకెప్పుడూ విశ్రాంతి దొరకదు- అంతే ఇంక...!" మైత్రి.

"నేనా మహారాణిని...! నా మహారాణివి నువ్వే కదే బంగారం!" మాటలు పెదాలు దాటలేదు-

కృతి కలిపిచ్చిన గ్లూకోజు తాగి- వోరగా ఒరిగాను. కృతి వెళ్లిపోయింది- కళ్లు మూయబడలేదు- ఏవో జ్ఞాపకాల తెర కళ్లని కమ్ముకుపోయాయి. అందులో ఎప్పుడు కునుకు పట్టేసిందో గుర్తు లేదు.

** ** **

నాకు ఉదయాన్నే ఆరింటికల్లా అలారం మ్రోగినట్టు తెలివొచ్చేస్తుంది- అప్పట్లో పని, బాధ్యతలు లేపేవి- ఇప్పుడు సంగీతంపై ప్రేమ



లేపుతుంది- ఔను! ఉదయాన్నే లేచి పాటలు వినడం ఇష్టం. భక్తిపాటల్లో భగవన్మయం పొందుతాను. ఈ వయసులో, నా మనసునీ, తనువునీ ఆర్ద్రమయం చేసేవవే!" చెవుల్లో గడ్డలేసేయేమో... సౌండ్ బిగ్గరగా పెడితేనే కానీ వినిపించదు. కార్తీక్ నా కోసం ఓ సౌండ్‌ప్రూఫ్, ఎసి గదిని ఒకటి కేటాయించాడు- అందులో అన్నీ నా ఆల్బమ్స్, పుస్తకాలు, వీణ, ఫ్లూట్ అన్నీ పెట్టుకున్నాను.

కృతి ప్రేమగా ఒకరోజు నా రూమ్‌ని అడిగింది- నా రూమేంటి నా ప్రాణమైనా ఇస్తాను బంగారం అని ఆ రూమ్‌ని వదిలి వాకిట్లోకి షిఫ్ట్ అయ్యాను. ఎనిమిదేళ్లు,నా రూమ్ ఈ వీధివాకిలే!

ప్రస్తుతం ఆ రూమ్‌లో మైత్రి ఉంటోంది- ఆ రూమ్‌లో నేనెంత సౌండ్‌తో పాటలువిన్నా ఎవరికి తెలిసేదికాదు- ముసలివాళ్లకి అలాంటి రూము అవసరం ఏమిటో ఇప్పుడర్థమవుతోంది- కృతిని వదల్లేక ఆమెకి పెళ్లి చేసి అల్లుడికి, అమ్మాయికి మా ఇంట్లోనే మేడపైన ఇచ్చాం. నేను తిరిగి వంట, వార్పు, మనవరాలిని అంతా చూసుకున్నంతకాలం బాగానే జరిగింది. నా ఆరోగ్యం క్షీణిస్తున్నప్పట్నుంచీ తోడు అవసరం పడినప్పట్నుంచీ కృతి కిందకొచ్చేసింది- పై ఫ్లోర్ కృతి ఆఫీస్... ఆఫీస్, ఇల్లు ఒకటే! కళ్లముందే అమ్మాయి వుండటాన్ని మించి ఆనందం ఏముంటుందనిపించింది?ఇదంతా జరిగి ఎనిమిదేళ్లు నిండుతున్నాయి. "ఆనతి నీయరా హరా!" ఆహా! ఎంత మంచి సాహిత్యం, ఏమి స్వరమాధుర్యం..."

మధ్యలో పాట ఆగిపోయింది. గుండె ఆగినట్టయి కళ్లు తెరిచాను- మైత్రి వచ్చి స్విచ్ ఆర్పేసి వెళ్లిపోతోంది...

"తెల్లవారే ఈ గోలొకటి- అస్సలు అర్థం చేసుకోరు- ఎడ్జెస్ట్ అవ్వరు అనేస్తూ మైత్రి...

అడ్జెస్ట్... అవ్వంది ఎవరు- నేనా? జీవితమంతా అవుతూ వస్తున్నదదే! మైత్రికిష్టమైన విజ్‌కిడ్స్ ప్రోగ్రాం కోసం నాకిష్టమైన సంగీతం ప్రోగ్రాంని, కార్తీక్ న్యూస్ ఛానల్స్‌ని త్యాగం చేసినలాంటి చిన్న చిన్న విషయాల నుంచి, మైత్రి డ్యాన్స్ ప్రోగ్రాం ఇంగ్లండ్‌లో ఇవ్వటంకోసం ఎన్నో అవసరాలను, కనీస సౌకర్యాలను కూడా త్యాగం చేసి మమ్మల్నిద్దరినీ పంపిన కార్తీక్... నా వంతుగా నా విరిగిన కాలి ఏడాది ఫిజియోథెరపీ ఖర్చుని జమచేసి ఇచ్చినప్పటి ఆనందం... కృతి ఇచ్చే ప్రేమపూరిత ముద్దు ముందు అన్ని త్యాగాలు బలాదూరైపోయేవి. ఆ రోజులలా ఉండిపోకుండా అసలు ముసలెందుకయ్యామా? అనిపిస్తోంది...

** ** **

ఈ లోగా కామాక్షత్త వచ్చింది. మా పక్కనే వుంటారు. కళ్లు ఆనవు... కర్ర సాయంతో ఎప్పుడైనా గుండెభారం దించుకోడానికి వచ్చిపోతుంటుంది. నాకే చుట్టరికం లేకున్నా నేను 'అత్తా' అంటుంటాను. నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఆవిడకి. పండుముదుసలి. ఒంటరిగా ఉంటోంది.

"అమ్మా! కోడలా! నిన్న నా మూడో కోడలొచ్చి ఫించను కావాలని అడిగింధమ్మా చూసావా చోద్యం- నాలుగు డబ్బులివ్వడం లేదు- నన్ను పీక్కుతుంటున్నారమ్మా- నెల్లాళ్ల సామాను మూటకట్టుకుని డబ్బులివ్వలేదని నానా మాటలని ఇప్పుడే వెళ్లిందమ్మా. ఇలా చెయ్యడం బాగుందా?" కాసేపు బాధపడి వెళ్లిపోయింది.

జీవనాడులన్నీ వదలిపోయినట్టు అన్పించింది- 'మేం మా పిల్లల్ని గొప్పవారిని చేయాలనే తపనలో మానవతావాదులుగా చేయలేకపోతున్నామా? మేమూ ఒకరోజు ముసలవుతామని- అప్పుడు వారు మాకు ఆసరాగా నిలవాలనే అంశాన్ని వాళ్లకెన్నడూ చెప్పకపోవటం వల్లనా!

మా పిల్లలు ఎందుకు మమ్మల్నీ వాళ్ల కన్నతల్లులుగా చూసుకోవాలనే అంశాన్ని జీర్ణం చేసుకోలేకపోతున్నారు?"...

"అమ్మా!" పిలుపు విన్న గుండె ఝల్లుమన్పించింది.

గుండెలకు హత్తుకోవాలని కృతివైపుకి చేతులు తెలీకుండానే సాకాయి- చేతులను తప్పించుకుంటూ రెక్కలు పట్టుకుని లేపింది కృతి- రోజూ నా కాలకృత్యాలు తీర్చేది ఆమే. నా తల దువ్వి- "అమ్మా! హెయిర్ కట్ చేయించుకో- చేతులు నొప్పిగా ఉన్నాయి చిక్కులు తియ్యలేక- అంది" ఆమె కష్టం వినగానే కళ్లు చెమ్మగిల్లాయి నాకు- వెంటనే పనిమనిషితో ఎదురింటి బ్యూటీపార్లర్ నిర్మలగారికి కబురంపాను- ఆవిడే ఇంటికొచ్చి సుబ్బరంగా బేబీ కట్ చేసేసింది- జీవితంలో ఏనాడూ కట్ చేసుకోవడానికి ఇష్టపడని నేను, అదే ఈ కోరిక మరెవరైనా కోరివుంటే అసలాలోచించేదాన్నే కాదు.. కానీ నా వల్ల నా తల్లికి కష్టం కలగకూడదు. అది హెయిర్ అయినా, రేపు నా ప్రాణమైనా.

** ** **

కృతి వచ్చేసరికి నా హెయిర్‌కట్ జరిగిపోయింది- నన్ను చూసి బంగారం నవ్వింది- అలా నన్ను చూసి మనసారా నవ్వి ఎన్నో ఏళ్లయింది! రాతిరయితే చాలు అందరూ నా చుట్టూ ఉండాలని, నా ఎదురుగా కూర్చుని వాళ్ల వాళ్ల పనులు చేసుకోవాలని వుంటుంది- ఈ గాజుకళ్ల లోంచి ఎన్నో రోజులు ఈ బంగారు తల్లులని చూడలేనననే వాస్తవం గుర్తొస్తే ఏదో నెపంతో వాళ్లని చూడటానికి పిలవాలనిపిస్తుంది.

** ** **

మధ్యాహ్నం భోజనం వచ్చింది- జావ, చారు, చప్పటి మజ్జిగ- ఇదే నా రోజూ ఆహారం- ఏంటే- ఏదో జబ్బొచ్చినట్లు అన్నాను- ఏళ్లుగా తింటున్నా చప్పపడిన నాలుకతో- సన్నగా, భయపడుతూ... విన్న మైత్రి ఏమీ అనలేదు- మౌనంగా వెళ్లిపోయింది. మర్నాడు ఎవరూ లేని సమయంలో- ఇంటిపన్ను కాగితాల మీద నేను సంతకం పెట్టి తీసుకున్నాను. ఇంటిపన్ను నాలుగేళ్లుగా భారీగా మోత వేస్తున్నాడని కృతి కార్పొరేషన్ మీద కోర్టులో కేసు వేసింది. ఈ విషయాలేవీ నాకు తెలీదు- కార్పొరేషన్ ఆఫీసబ్బాయి వచ్చినపుడు... ఎవరూ లేకపోవడంతో నన్నే సంతకం పెట్టమన్నాడు- సరేనని పెట్టేసాను. అది లక్ష రూపాయల పన్ను కట్టమని కాగితం- సంతకం పెట్టి తీసుకున్నపుడు కవరు విప్పి చదవనివ్వడుకదా! ఆవిషయం నాకూ తెలీదు. వాళ్లొచ్చాక కవరువిప్పి చూసారు. నిన్నెవరు సంతకం పెట్టమన్నారని నానా మాటలు- ఒకటేమిటి?!

నిజానికి నేనింత దూరం ఆలోచించలేదు. నా ప్రమేయం లేకుండా జరిగిపోయింది.

మా అల్లుడిగారితో చానా ఏళ్ల క్రితం కృతికి కాస్త మనస్పర్థలొస్తే తన పేరుమీద తనకు ఆత్మవిశ్వాసం ఉండాలని కార్తీక్‌కి నచ్చచెప్పి ఇల్లు ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేశాం. నిజానికిప్పుడు ఆమె పంచనే నేను- అప్పటి నుంచి ఇంటిపన్ను విషయాలు నాలుగైదేళ్లు చెప్పేది- అటు పిమ్మట ఏ వివరాలు నాకు తెలీధు. నేనూ అడగలేదు.

కార్తీక్‌తో మాట్లాడాలనుందని మైత్రితో మెల్లగా చెప్పాను.

"తాతగారా!" అంటూ ఫోన్ కలిపిచ్చింది.

"హలో! నాన్నా!" పిలుపు వినే సగం దుఃఖం ముంచుకొచ్చింది గొంతులోకి. మిగతా సగం కళ్లలోంచి నీటిధారలా...

"నాన్నా! ఎప్పుడొస్తావ్!" అన్నాను- మెల్లగా గొంతు పూడ్చుకుంటూ.

"నాకూ వచ్చేయాలనే వుంది- ఇక్కడో చిన్న కమిషన్ పనిమీద..."

"నాన్నా! కృతి పేరుమీద కాకుండా నావి అని ఏవైనా ఆస్తులు, నగలు, డబ్బులు వున్నాయా?" అడిగాను.

"అదేంటి? ఎందుకు? ఏమైంది?" అని ప్రశ్నలక్కడ్నుంచి.

సమాధానం నాకు తెలిసిందే!

No లేవు.

నాదనే ప్రతీదీ ఏనాడో బంగారానికిచ్చేసాను- కార్తీక్, నాకూ నిస్సహాయంగా. తన పెన్షన్ కూడా కృతి సంగీత అకాడమీకి నెలనెలా

వెళ్లిపోతుంది- గుండెమీద తన్నినా శక్తి వున్న రోజులవి.

చిన్నమాటకే గుండె పగిలే రోజులివి- తట్టుకునే శక్తి, ఎదిరి నిలబడే సత్తువ రెండూ లేవు. ఆఫీసునుంచి వచ్చిన కృతి మళ్లీ లక్ష రూపాయల గురించి ఎత్తింది. మా అత్తగారు, మా ఆయనా వాటాగా రాసిన ఇల్లు తాకట్టు పెట్టి లక్ష ఇవ్వాల్సిందిగా, ఆ ఊరు నుంచి వచ్చిన ఓ పెద్దమనిషి ద్వారా కబురంపాను. ఇదంతా ఓ పది రోజుల్లో జరిగిపోయి డబ్బు కార్తీక్ పేర బ్యాంకులో పడిపోవటం, ఎటిఎం ద్వారా దాన్ని తీయించి కృతి చేతిలో పెట్టడం జరిగాయి.

** ** **

ఆరోజు కాబోలు మైత్రి పెసరపప్పు పచ్చడి చేసి భోజనంలో వడ్డించింది. నేను భోజనం వద్దని సంజ్ఞ చేసాను.

"ఏం! ఎందుకొద్దు! తిను- జిహ్వాచాపల్యం ఇంకా పోలేదు- అంటూ మైత్రి గొణిగింది- పోనీ ఈ కొబ్బరినీళ్లు తాగు" అంటూ ఓ గ్లాసు తీసుకొచ్చి నన్ను లేపబోయింది. "అమ్మో! జ్వరం- అమ్మమ్మ ఒళ్లు కాలిపోతోంది" అంటూ- ఓ మాత్ర ఇచ్చి దుప్పటి కప్పింది. రాత్రికి జ్వరం సర్దుకుంది-కృతి మళ్లీ జావ, పచ్చడి, చారు తెచ్చింది. వద్దన్నాను సంజ్ఞతోనే!

"ఏం? నీకేం తక్కువ చేస్తున్నాను- ఈరోజు పెట్టింది రేపు వద్దు- ముసలైనా జిహ్వారుచి చావలేదు" అంటూ ఆమె ఎత్తుకుంది.

"ఇవాళ తిన్నది రేపు తినడానికి ఇష్టపడని నా బంగారం కోసం పంజాబీ, రాజస్థానీ, గుజరాతి, బెంగాలీ- అన్ని రకాల వంటకాలు నేర్చుకుని- రోజుకోటి చేసేదాన్ని- దత్తుడు రేపు పుడతాడనగా- ఇవాళ్టి వరకు కృతికోసం నేనే వంట చేసేదాన్ని- ఇంటిల్లిపాది, నౌకర్లు, చాకర్లు ఉన్నా- కృతికి నేనే వంటమనిషిని. ఆ తృప్తే వేరు. తనకి తినిపించడం, తన కడుపు నింపడం నాకు భగవంతుడిచ్చిన వరంగా భావించే దాన్ని. ఇలా నా డెబ్బై ఏళ్ల వరకు ఏనాడూ కృతి వంటింట్లోకి అడుగు పెట్టకుండా చూసుకున్నాను.



"అమ్మో! జ్వరం- అమ్మమ్మ ఒళ్లు కాలిపోతోంది" అంటూ- ఓ మాత్ర ఇచ్చి దుప్పటి కప్పింది. రాత్రికి జ్వరం సర్దుకుంది-కృతి మళ్లీ జావ, పచ్చడి, చారు తెచ్చింది. వద్దన్నాను సంజ్ఞతోనే!

"అమ్మా! ఇది తినమ్మా! అని ప్రేమగా పక్కనే కూర్చుంటే విషమిచ్చినా తినేస్తానే బంగారం- అనుకున్నాను లోపల్లోపల- మైత్రి కూతురు పేరు సాధన. పాకుతూ నా దగ్గరకొచ్చేది- ఆమెతోనూ ఆత్మీయబంధం... మమకారం- ఏడిస్తే కొట్టుకుపోవటం... నవ్వితే మైమరిచిపోయేదాన్ని. లంకంత కొంప- సాధన పాకుతుంటే ఏది నోట్లో పెట్టుకుంటుందో అని కళ్లార్పకుండా అటే చూసేదాన్ని. నా చేతికర్ర అందుకునేది. అదెక్కడ తన మీద పడిపోతుందో అని వద్దనేదాన్ని...

వద్దమ్మా! ఆవిడ వస్తువులేమీ ముట్టుకోకు" అంటూ ఎత్తుకుని తీసుకెళ్లిపోయేది మైత్రి. నా మంచంచుట్టూ ఓ రోజు ఫినాయిల్ వేసుకోవడం మరిచిపోయాను- "కంపు కంపు" సాధన వస్తుంటే వద్దని వారించాను- కంపుల్లో తడిముద్దలో ఉన్న నాకు నేనే అసహ్యమన్పించాను. సాధన చిన్నపాప- ఇన్ఫెక్షన్ వస్తేనో అని- అలా అన్నాను.

"వద్దమ్మా... వెళ్లకు" అంటూ లాక్కెళ్లిపోయింది మైత్రి. ఇప్పుడంతా నాకు సాధనే. చిన్నప్పటి నా బంగారమే గుర్తొస్తుంది. సాధన ఏడుపు విన్పిస్తే గుండె కొట్టుకుంటుంది. మూణ్ణెళ్ల సాధనతో మూడు తరాల బంధం మూడు తరాలు వెనక్కెళ్లిపోతోంది...

మైత్రి వాళ్లాయన, ఆడపడుచు వచ్చి మైత్రి, సాధనలను తమతో తీసుకెళ్లిపోతారని కృతి ఉదయాన్నే చెప్పింది. "అప్పుడే?" అన్నాను.

"ఇంకెన్నాళ్లుంటారమ్మా!" తన వాళ్లని వదిలేసి..." అంది కృతి.

"తనవాళ్లు?"- ఎవరు? తననింత చేసినవాళ్లు తనవారు కారా? మైత్రి చిన్నతనం- యవ్వనం అంతా నాట్యం అభ్యసించడంలోనే గడిచిపోయింది. అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన మైత్రి ప్రతి మెడలును అమ్మమ్మ అంటూ ముందు నాకే చూపించేది.

"ఈ అమ్మమ్మ ఇంక నీతో లక్నోకి డ్యాన్స్ ప్రోగ్రాంకి రాలేదంటే"

"ఏం?" అడిగింది.

"ఆ యముడింక నన్ను తీసుకుపోతా అంటున్నాడు"

"ఆయనకి కన్పించకుండా నిన్ను నా గదిలో బంధించేస్తాగా" అంటూ అమాయకంగా నన్ను హత్తుకుని గదిలో పెట్టేసే మైత్రి- నా చిట్టితల్లి మైత్రి తను నన్ను దాచిపెట్టిన వాకిలిలోనే నేనుండిపోయానిప్పుడు- మళ్లీ నా కన్నతల్లిని చూడగలుగుతానో లేదో ఈ కళ్లతో...

డెబ్బై ఐదేళ్లవరకు అందరూ దత్తు, గాయత్రి, మైత్రి ఎప్పుడొచ్చినా నా చుట్టూనే కూర్చునేవాళ్లు- ఆకలైనా, నిద్రైనా... నాతోనే.

చివరికి మైత్రి దీపక్‌ని ప్రేమించిన సంగతి కూడా నాకే చెప్పింది.

మొండిగా నేనే అందరినీ ఒప్పించి పెళ్లి జరిపించాను. దీపక్ కూడా చాలా మంచివాడు. మైత్రిని కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. మైత్రి ప్రోగ్రాంలన్నింటిలో తనూ ఉంటాడు- ఆమె కళని ప్రత్యక్షంగా ప్రోత్సహిస్తున్నాడు. వాళ్లిద్దరూ కలుస్తారనే ఆనందాన్ని నేను కాదనలేకపోతున్నాను. కానీ నేను నా జన్మలో మళ్లీ చూడలేననే నిజాన్ని తల్చుకుంటే దుఃఖం పొగుకొస్తోంది... ఇటు గాయత్రి, అటు దత్తుడు ఇద్దరూ నా చుట్టూ చేరి నాతో అన్ని కబుర్లు చెప్పేవారు. "ముందు నాదంటే, నాదంటూ చీమ కుట్టినట్టి చిన్నవిషయాలు సైతం చెప్తూ, నా మెడ అటూ ఇటూ తిప్పేవారు- అలాంటి నా బంగారుతల్లి ఇప్పుడు అసలే మాట్లాడదు. దగ్గరగా ఉందన్నపేరే, మానసికంగా నాకు చాలా దూరమైంది. శక్తి, స్తోమతలు లేకుంటే ఇంతేనేమో...!"

వృద్ధాప్యం మరో బాల్యం అంటారే- మరి నా మరో బాల్యం...?

నిద్రలోకి జారుకున్నా- కృతి ఆఫీసుకి, మైత్రి, సాధనలు గుడికి వెళ్లారు. నాకు చెప్పారట- నాకేం గుర్తులేదు. మధ్యాహ్నం మైత్రి వచ్చి- "అమ్మమ్మా! అంటూ పరుగున వచ్చి నన్ను లేపింది- ఉలిక్కిపడి లేచాను- సాధనకేమైందో అనుకుని- చుట్టూరా తలుపులు- తీసి వున్నాయి- బీరువా బార్లా తీసి వుంది. అపశకునంలా తోచింది.

"ఏమైందన్నాను"- 'నువ్వే చెప్పాలి!' మేం లేనపుడు ఎవరొచ్చారు? అంది- నాకు గుర్తులేదే! అన్నాను.

క్షణాల్లో దొంగలు పడ్డ విషయం కృతికి చేరడం- ఆమె పరిగెత్తి రావటం- పోలీసులు, ఫింగర్‌ప్రింట్స్, డాగ్ స్క్వాడ్‌లు... తతంగమంతా జరిగిపోతోంది.

'పోయిందంతా అమ్మ నాకిచ్చిన బంగారమే!"

"ఒకటా, రెండా పాతిక తులాలు" అంటూ మరో ఆవిడ.

"అయినా అంత ఆదమరచి నిద్రేంటండీ మామ్మగారూ!" మరో ఆవిడ ప్రశ్న- ఇలా అన్నీ జరిగాక రాత్రయింది.

నాకిచ్చిన జావ తాగాను.

"ఏం జరిగినా దీనికేం కొదవలేదు. అయినా నిన్ను నమ్మి ఇల్లు తాళం వేయకుండా ఉండటం" నాదే తప్పు.

"ఇచ్చినట్టే ఇచ్చి పట్టుకుపోయావుగా- ఇక సంతోషమేనా?" అంటూ కృతి, మైత్రిలు ఒకరి తర్వాత ఒకరు అందుకుంటూనే ఉన్నారు.

"అమ్మా 'బంగారం' ఈ బంగారాలు శాశ్వతం కాదురా తల్లీ! అనుకుంటే మళ్లీ వస్తాయమ్మా! వీటిమీద మనసుపెట్టి అన్నాలు మానయ్యకండమ్మా!" అన్నాను ధైర్యంచేసి.

"ఏదైనా పోగొట్టుకోవడం తేలికే! పోగొట్టుకున్నది సంపాదించడమే కష్టం. ఏ ఆశలూ లేకుండా మంచాన పడితే మేమూ చెప్తాం నీలాగే వేదాంతం" అన్నది.

"మనకు మామ్మగారు దక్కారు అంతే చాలు" అంది పనిమనిషి.

"అలాంటిది జరుగుతుందేమోనని ముందే కళ్లుమూసి వుంటుంది అమ్మమ్మ" అంది మైత్రి.

ఈ మాటలేవీ నా చెవిన పడొద్దని చెవులు మూసాను.

నా మనసులోకి చేరి అసహ్యాన్ని కలిగించకూడదని కళ్లు మూసుకుని భగవద్గీత ద్వితీయాధ్యాయం మననం చేసుకున్నాను.

"భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృత చేతసామ్
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధాన విధయతే!"

మనసును, ఆత్మను స్థిరపరచుకుని- ఆ శ్లోకాల భావాలను మననం చేసుకుంటూ నిర్మల నిద్రలోకి జారిపోయాను.

ఉదయాన్నే..."లక్ష్మీ! లక్ష్మీ!" అంటూ పిలుపు విన్పించింది- నిటారుగా నిల్చుని ఠీవీగా వస్తున్న ధనూరాధని చూసి ఆనందం పట్టలేకపోయాను.

ఎన్నేళ్లయిందో ధనుని చూసి. "నేను గుర్తున్నానే ధనూ?" ఆ- "నీకు మాత్రం? ఉన్నానే- "ఉండలేక నేనే వచ్చాను".

ఏమిటీ ఈ వీధివాకిట్లో. రూమంతా తేరిపారి చూస్తూ అడిగింది.

"గాలి- వెలుతురు ఉంటుందని నేనే ఇక్కడుంటున్నానే?"

"మరి కార్తీక్?"

దత్తుడి దగ్గరకి ముంబాయి వెళ్లారు ఏదో పనిమీద-వచ్చేస్తారు?

"అలికిడేం లేదేంటే- పిల్లలు వాళ్లు? చుట్టూ చూసింది"

నా ప్రాణస్నేహితురాలొచ్చిందని ఆనందంతో అరవాలన్పించింది. తననందరూ పలకరించి వెళ్లాలన్పించింది. మా ఇద్దరిదీ మూడోతరగతి నుంచి స్నేహం- దానికో బాబు పేరు తన్మయ్! ఒకరంటే ఒకరు ప్రాణమిచ్చేంత స్నేహం మాది. పిల్లలు- ఆయనల గురించి మాట్లాడేసుకున్నాక- ఓ పట్టిమంచం నా పక్కనే వాల్చుకుని దానిమీద వాలింది.

"చాలా పాడైపోయావే లక్ష్మీ! నాతో రా! ఇద్దరం కలిసే చద్దాం!" అంది- ఆ మాట నాతో ఇంతవరకూ ఎవరూ అనలేదు.

సరదాకి నిన్న "మైత్రీ! నేను నీతో మీ ఇంటికొచ్చేస్తాను- నన్ను తీసుకెళ్లిపోతావా? సాధనతోపాటే నేనూను!" అన్నాను.

ఆ! నువ్వొక్కత్తివే తక్కువైంది- "పెళ్లికెళ్తూ పిల్లిని చంకలో పెట్టుకెళ్లినట్టు" అంది కృతి. మైత్రి అంతా విని నవ్వి ఊరుకుంది. ఇది గుర్తొచ్చి కళ్లంబట నీళ్లొచ్చేసాయి.

'ఛీ! ఏడవకే లక్ష్మీ! నీకిక్కడంతగా నచ్చిందేమో! నేను బాధపెడుతున్నానేమో! సారీయే" అంది.

"నువ్వు దత్తుడి దగ్గర ఉండొచ్చుగా".

"ఉండకేం ఉన్నాను- కానీ వాడు దేశాలంబట తిరుగుతుంటాడే, సైంటిస్ట్ కదా! కోడలూ సైటింస్టేగా- ఇద్దరూ ఉద్యోగాలకెళ్పోతారు. వచ్చినా చూసేనాథులు లేరు- అక్కడ- మమ్మల్ని పిజిలో (పేయింగ్ గెస్ట్‌గా) చేరుస్తానని చెప్పారు- దాంతో మేం మా ఇంటికి చేరుకున్నాం". ఇదంతా జరిగి ఏడాది దాటింది- అన్నాను కానీ ఏదీ పెదవి దాటినట్టు లేదు.

"ఏంటి లక్ష్మీ సమాధానమే చెప్పటంలేదు" అంది గద్దిస్తూ.

ఏదీ వినిపిస్తేనా! చెవుల్లో గడ్డలొచ్చేసాయే!

ధను వచ్చి గంట దాటింది- మంచినీళ్లయినా ఇవ్వలేదెవరూ! "అమ్మా! బంగారం" అని పిలిచాను- రెండు మూడుసార్లు కర్రని చప్పుడు చేసాను.

ఆ! అని పిలుపు విన్పించింది- కృతి వచ్చింది- ధనూని చూసి "నమస్తే! అండీ!" అంది. మైత్రి లోపల్నుంచి గ్లాసుడు మంచినీళ్లు- కొద్దిసేపటికే రెండు గ్లాసుల కాఫీ తెచ్చింది. ధను, నేను ఆప్యాయంగా గ్లాసులవేపు చూసి గబుక్కున ఎవరివి వాళ్లు అందుకున్నాం.

"అబ్బ ఎన్నాళ్లయిందే గరమ్ గరమ్ కాఫీ తాగి" అనిపించింది ధను.

"ఏం?" అన్నాను- తన్మయ్, కోడలు డాక్టర్లుకదా! నన్ను తాగనివ్వరు- వాళ్లు లేనపుడు తాగుతున్నానని- తెప్పించడమే మానేసారు" అంది.

ఇక్కడ నా పరిస్థితీ అంతే- రోజూ పళ్లు తోమాక వేడివేడి ఫిల్టరు కాఫీ తాగుతూ కిషోర్‌కుమార్, ముఖేష్ పాటలు వింటూ పేపరు చదువుతూ ఉదయాన్ని ప్రారంభించేదాన్ని- నాకోపిక ఉన్నంతవరకు- ఆ తర్వాత 'ఫిల్టర్ కాఫీ ఓ 'ఘుంఘూటం అని కొన్నాళ్లు- మరిచినట్టు- విననట్టు ఇలా మొత్తంగా కాఫీ ప్రహసనాన్ని పక్కన పెట్టేసింది గాయత్రి- మళ్లీ ఇన్నేళ్లకు- దాదాపుగా ఎనిమిదేళ్లయింది.

"నీ సంగతేంటి-?" అంది ధను గబగబ సిప్ చేసేస్తూ.

"నేను నవ్వి ఊరుకున్నాను- కాఫీలయ్యాక ఇద్దరం పనిమనిషికి సైగ చేసాం- పచ్చీస్ పాళీ బోర్డు- పిక్కలు తెమ్మని- ఆమె తెచ్చింది. మేమిద్దరం పచ్చీస్‌పాళీ ఆడుకునేవాళ్లం. ఈ రోజుల్లో దాన్నే చెస్ అంటున్నారు. ఇద్దరం ఒకరి చేతుల్లో ఒకరు ఓడిపోతూంటే అదో ఆనందం- కృతి ధనుతో మాట్లాడి ఆఫీస్‌కెళ్లిపోయింది. మైత్రి స్నానాల గదిలో ఉన్నది చూసి పనమ్మాయిచేత మరోసారి కాఫీ కలిపించుకున్నాం.

ఇద్దరం తాగుతూ మరోసారి ఎత్తేసుకుంటూ మా స్నేహితులందరి గురించి గుర్తు చేసుకున్నాం. మైత్రి, సాధనలు మార్కెట్ వెళ్లడం చూసి నేను ధను వంటింట్లోకి దూరాం. ఎన్నేళ్లయిందో పొయ్యి ముట్టుకుని- అన్నీ తడుముకుంటూ పనిమనిషి సాయంతో వంట చేసుకున్నాం. మాకిష్టమైన పెసరపప్పు పచ్చడి, తోటకూర పులుసు, వంకాయ పచ్చికారం కూర చేసుకుని కమ్మగా భోజనాలు చేసాం.

ఇద్దరం మైత్రి వచ్చేసరికి పడుకున్నాం- లేచాక "ఎన్నేళ్లయింది ఇంత తృప్తిగా భోజనం చేసి- మామిడిపండుతో పెరుగు- అన్నం తిని" అనిపించింది తెలీకుండానే నేను".

సాయంత్రం రెండోమారు మళ్లీ కాఫీ, వేడివేడి బజ్జీలిచ్చింది మైత్రి- ఇద్దరం తిని- సాగరతీరంలో గంటలకొద్దీ మేం గడిపిన సాయంకాలాలు గుర్తు చేసుకున్నాం- మధ్యలో సడన్‌గా "లక్ష్మీ! ఒక్కపాట పాడవే-" అదీ- కామాక్షీ- భైరవిరాగం స్వరజతి కరెక్టేనా- నీ పాట నా టేపులో వుంది తెలుసా- మళ్లీ ఎన్నాళ్లకి వింటానో- వింటానో లేదో! అంది.

"నన్ను పాడమని అడిగే గొంతే లేదు ధను" అంటూ కన్నీటి ముద్దయిపోయాను- "అదేంటే! కృతికి సంగీతం నేర్పించింది నువ్వు- తనంతటి గొప్ప విద్వాంసురాలవడానికి మూలం నువ్వు. నిన్నడగకపోవడమేంటే?" అంది. అన్నీ తెలిసిన ధను నా చేతులు పట్టుకుని, కళ్లు తుడుస్తూ.

కాసేపయ్యాక నేను పాట మొదలుపెట్టాను.

"నీ... దా... పా... దనిసా... దని సరిగమ పమగరీ... నీదా- దని సపా సనిదపా మగరి..." ఊపిరి నిలపలేని గొంతుతో పాడాను- సాధన, లోపల్నించి మైత్రి, కృతిలు వచ్చి విన్నారు- చాలా బాగుందమ్మా! అన్నది కృతి- సాధన అందర్నీ చూసి చప్పట్లు చరచడం మొదలెట్టింది.

"ఇంకొక్కటి పాడవే! అదేంటది- చిన్నకృష్ణ నీకు" అది- అంది.

"చిన్నికృష్ణ నీకు ఇంత అల్లరితనమేలనురా! గొల్లవారిండ్లకేగి గోలపడబోకురా". పాడాను- మైత్రి రికార్డ్ చేసుకుంది. ధను ఫోన్‌లో రికార్డ్ చేసుకుంది- కృతి ధ్యానంగా విన్నది తెలీకుండానే టైం అయిపోవడం- చీకటిపడటం- ఇద్దరం భోంచేసి అలా డాబాలో రెండు పడక్కుర్చీల్లో కూర్చుని వెన్నెల రాత్రంతా కబుర్లు నింపుకున్నాం- గుండెనిండా ఆ కబుర్లు- ఆ జ్ఞాపకాలు. ఈ జన్మంతా తనివి తీరనన్ని కబుర్లు- "ఈ జన్మకిక సెలవు నేస్తం!" అన్నాను- మధ్యలో- త్రుళ్లిపడి చూసింది-

"అదేంటది- నువ్వు లేకపోతే కార్తీక్ ఒంటరైపోడూ!" అంది.

"ఇంకా మనుషుల మీద మమకారం చావలేదా ధనూ! ఇంత చూసావు? తనకి వంటరితనం అనిపిస్తే ఏంటి- ఎప్పటికైనా తనూ నాలాగా వెళ్లాల్సినవాడేగా- ముందు- వెనక అంతే!" అన్నాను.

> ***"తనవాళ్లు?"- ఎవరు? తననింత చేసినవాళ్లు తనవారు కారా? మైత్రి చిన్నతనం- యవ్వనం అంతా నాట్యం అభ్యసించడంలోనే గడిచిపోయింది. కూచిపూడి, కథక్, కథక్కళి, భరతనాట్యం ఇలా అన్ని నాట్యశైలి లను ఆమెకు పట్టుపట్టి నేర్పించాను-***

ధను- నన్ను గట్టిగా, అమాంతం పట్టేసుకుంది.

"మనం చేసిన తప్పేంటి లక్ష్మీ! పిల్లలమీదే సర్వం ధారపోసి వాళ్లనే సర్వస్వంగా చూసుకున్నాం- మనం మన అభిరుచులు, మన సరదాలు, మన సాహసాలు అన్నిటినీ చంపేసుకున్నాం- మరి పిల్లలు మనల్నెందుకు వాళ్లలాగే చూడలేకపోతున్నారు?" అంది ధను.

"లేదు ధను- పెంచడం మన బాధ్యత, మన వరం. వాళ్లు మనల్ని మనలాగే పాలించాలనుకోవడం స్వార్థం. వాళ్లు వాళ్ల పిల్లల్ని- ఇలా ప్రతివారు వాళ్లవాళ్ల పిల్లల్ని పెంచుకుంటూనే ఉన్నారు- అందుకే తల్లి స్థానానికో ప్రత్యేకత" అన్నాను.

ఎప్పుడు నిద్రలోకి జారామో- ఎప్పుడు తెల్లారిందో తెలీలేదు-

మైత్రి వాళ్ల అత్తగారు, వాళ్లాయన రావటం- ఇంట్లో అంతా సందడి...

సాధనతో నాతో కలిసి తీయించుకున్న ఫొటో ఉండాలంటూ మైత్రి వాళ్లయన ఫొటోలు తీసాడు. "నన్ను ఆప్యాయంగా పలకరించి- నా ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు".

"మళ్లీ ఎప్పుడో- దూరాభారం వెళ్పోతున్నారు అన్నాను"

"మళ్లీ మీరెప్పుడు చూడాలనుకుంటే అప్పుడు పంపించనా మామ్మగారూ!" అన్నాడు- గుండె దూదిపింజలా ఎగిరిపోయింది.

"దీపక్ వాళ్ల తాతగారు, నేను ఒకే పేపర్‌లో కలిసి పనిచేసాం- వాళ్ల తాతగారు గుర్తొచ్చారు వెంటనే.

"బాబూ! తాతగారు బాగున్నారా?" అన్నాను.

ఆ! ఎప్పుడూ చెప్తుంటారు- మీ సాహస వార్తా కథనాల గురించి- ఏ దృశ్యాన్ని చూసినా కరిగిపోయే మీ సున్నిత మనసు గురించి- మీ సాహిత్య రచనలన్నీ మా తాతగారి దగ్గర పదిలంగా ఉన్నాయి- ఆయన తన స్వీయ పుస్తకంలో "నా దృష్టిలో ఉత్తమ మహిళా జర్నలిస్టు" అంటూ రాసిన కథలో మీ గురించి రాసారు అన్నాడు.

లోపల్నించి ధను వచ్చింది. "నమస్కారమండీ" అన్నాడు దీపక్.

"బాబూ! ఈ రోజేనా ప్రయాణం అడిగింది".

ఔనన్నట్లు నవ్వాడు.

"ధను అని నా ప్రాణస్నేహితురాలు" అన్నాను.

మీలాంటి నిస్వార్థ స్నేహాలు- ఈ కాలంలో లేవు మామ్మగారూ" అన్నాడు.

"మీ తాతగార్ని నేనూ మర్చిపోలేను- నన్ను, కార్తీక్‌ని కలిపిన వ్యక్తి ఆయనే. మా పెళ్లి దగ్గరుండి జరిపించారు- మీ మామ్మగారు, తాత గారు నన్ను సొంత తోబుట్టువులా చూసేవారు- ఆ రోజులు, ఆ నిస్వార్థ స్నేహాలు, ఆప్యాయతలూ అవీ వేరులే నాయనా".

వాళ్లు రాత్రి బండికి వెళ్ళోయారు. నేను, ధను సాధననే చూస్తుండి పోయాం కిటికీలోంచి- "ఏమివ్వగలను సాధనకి- తనచేత కాళ్లకి దండం పెట్టించినపుడు- ఏమివ్వాలో- "నాది అనేది ఏం మిగిలిందో- ఒళ్లంతా తడుముకున్నాను- వాళ్ల ముత్తాత కట్టిన మంగళసూత్రం తప్ప ఏదీ..." నవ్వుకుని సాధనని దగ్గరగా హత్తుకుని ఏడ్చేసాను-

వాళ్లెళ్లిపోయాక ఇల్లంతా బోసిపోయింది- ఒంటరితనం వెక్కిరించింది.

"నువ్వు" ఇలా- "నేను" చూడు- తన్మయ్ మీదే ప్రాణాలు పెట్టుకున్నానా- ఎలా ఉన్నానని రెండు రోజులైనా కనీసం ఫోనైనా చేయ లేదు చూడు- ఇప్పటివంతా కార్పొరేట్ ప్రేమలే- ఉదయాన్నే ఓసారి 'గుడ్‌మార్నింగ్ మామ్' అంటాడు- అంతే ఆ రోజుకిక. మళ్లీ మర్నాడో గుడ్‌మార్నింగ్ కొట్టేంతవరకు మేమెలా ఉన్నామో కూడా పట్టదు" అంది.

ఇలా ప్రస్తావించడం ధను- రెండోసారి- ఈసారి మౌనం వహిస్తే ఇదే బీజం నాటుకుపోతుందామెలో అన్పించింది.

"ధను 'నాది- నేను' అనే భావాలే అహంకారం- ధనం, ధర్మం, పరోపకారం వంటి సుగుణాలు నేర్పించి- 'అహం', మమకారాలను వీడాలని, పిల్లలకు దుష్కర్మ వాసనలు తగలకుండా ఈ 'మాయ'లో పడి ఉత్తమ సంస్కారాలు వారిలో మరుగునపడకుండా మనం తోడ్పడ్డాం. ప్రేమ ఉంటే సమర్పణ ఉంటుంది. మనం వాళ్లని ప్రేమించాం. స్వచ్ఛమైన మంచు బిందువుల్లాంటి మన పిల్లలను స్వచ్ఛంగా నిర్మలంగా తయారుచేసాం. అందులో మనం చాలా సమర్పించుకున్నాం- కొన్ని త్యాగం చేసాం. మన ప్రేమ, కృషి, తపస్సు ఏదీ వృధా పోదు. ఇది తరాలుగా కొనసాగుతున్న ప్రేమతత్వం".

** ** **

తెల్లారింది.

"లక్ష్మీ! ఇప్పుడు తల్లిదండ్రులను సరిగా చూడకపోతే పిల్లలకు మూడు నెలలు జైలుశిక్షంట తెలుసా! ముసలి తల్లిదండ్రులకు మంచి రోజులొచ్చి నట్టే" అంది పేపరు చూసి.

ఏ తల్లిదండ్రులు చెప్తారే- "తమ పిల్లలు సరిగా చూడటం లేదని. కోర్టులకెక్కి మన బంగారుపాపల్ని, బాబుల్ని జైళ్లలో పెట్టించగలమా"- అన్నాను.

"అంతేలే" అంది ధను.

ఈ లోగా "అమ్మగారూ! మామ్మగారూ!" అనుకుంటూ సత్తెమ్మ.

ముప్పై ఏళ్లక్రితం మా ఇంట్లో పనిచేసే సత్తెమ్మ- చాలా ఏళ్లయింది వచ్చి.... ఆ వృత్తి మానేసింది- దూరాభారం చేసి వస్తుందెప్పుడైనా అప్పుడప్పుడు.

"ఇలా రా... సత్తెమ్మా! ఎలా ఉన్నావ్" అన్న ఒక్క ప్రశ్నకు- మొత్తం అన్ని విషయాలూ ఏకరువు పెట్టింది- చాలాసేపు మాట్లాడుకున్నాం. నామంచం పక్కనే కూర్చున్న సత్తెమ్మ అక్కడే వాలింది.

ధను- అడిగింది "మీ ఫ్రెండా?"

"ఔను- స్నేహ ప్రవాహానికి జాతి, మత, వర్గ, వర్ణ, లింగ, విచక్షణ ఉండదు."

మా భోజనాలయ్యాక తనూజ్ వచ్చాడు- ధనుని తీసుకెళ్లడానికని అర్థమైంది- తనూజ్ ఫోంచేసాడు- ధను తయారైంది. గుండెల్లో ఇద్దరికీ కట్టలు తెంచుకున్న దుఃఖం- ఈ జన్మలో చూస్తామా లేమో! అని.

** ** **

మళ్లీ నేను, నా బంగారం- ఇద్దరమే... రోజులు గడుస్తున్నకొద్దీ- ఏదో నిద్ర- మైకం. జీవసత్తువ ఒడిలిపోతోంది- ఒకటికి లేచే శక్తి కూడా క్షీణించింది- ఏదీ తినాలనీ, తాగాలనీ ఆసక్తిలేదు- ఎప్పుడూ కళ్లు మూతపడిపోతున్నాయి.

** ** **

"నాన్నా! ఆ... స్పర్శకి తెలివొచ్చింది. తెలీకుండానే- "నాన్నా" అనీ సాను. కళ్లు తెరిచి చూస్తే 'కార్తీకే!' అదే చెరగని నవ్వు! పక్కనే దత్తుడు-

"వచ్చావా! దత్తుడూ వచ్చాడా?"

"ఔనమ్మా!"

"నాన్నా! ఏంటిలా అయిపోయావ్!" కార్తీక్ కళ్లలో గిర్రున నీళ్లు.

"అన్ని బాధ్యతలూ తీరిపోయాయి నాన్నా! ఇంకా ఉండి బాధపెట్టటమే".

"మరి నా బాధ్యత?" నన్ను గట్టిగా పట్టుకుని అడిగాడు.

"నన్ను ఒంటరిని చేస్తావా? నన్నెప్పటికీ వీడనని ఒట్టుపెట్టావా? లేదా?" సమాధానం ఇవ్వలేకపోయాను.

మౌనంగా... తన అరచేతుల్లో ఒరిగిపోయాను.

'లక్ష్మీ! నా లక్ష్మీ?'

మైత్రి ఉండే రూంలోకి మళ్లీ నన్ను షిఫ్ట్ చేసారు. ఇప్పుడు నాకీ పాటలు గోలగా అన్పిస్తున్నాయి.

"దొడ్డికి రాక వారం దాటింది నాన్నగారూ!" అంటూ కృతి ఏదో చెప్పింది కార్తీక్‌కి.

డాక్టర్‌ని తీసుకొచ్చాడు. ఏదో గొట్టం పెట్టారు- ఫలితం లేదు- అయినా రాలేదు. "ఆహారం లేదు- ఆవిడకి సెల్లైన్లు పనిచెయ్యవు- ఈ మందులు వాడండి" అంటూ ఏవో గొట్టాలిచ్చారు- కృతికి సంజ్ఞ చేసాను.

వచ్చింది దగ్గరగా- "కడుపులో పోట్లు- మెల్లగా కమోడ్‌పై కూర్చుంటాను" అన్నాను. బలవంతంగా చేయించింది- నా బంగారం.

నా బంగారంతోటి చేయించుకోవడం నచ్చటం లేదు- కానీ తప్పటం లేదు. కార్తీక్ ఆ రాత్రంతా నా మంచం కిందే, నా మీద చెయ్యేసి ఏవో మాట్లాడుతూనే వున్నాడు.

** ** **

అందరినీ ఎదిరించి ఒక్కటై చిల్లిగవ్వ లేకుండా ప్రారంభించిన మా జీవితాలను తన మాటల్లో గుర్తు చేసుకున్నాను.

"లక్ష్మీ! నువ్వు చనిపోయేటపుడు- కనీసం... నిన్ను చేసుకుని నేనేదీ కోల్పోలేదు కార్తీక్! అని అనేలా చేస్తాను- అలా మన జీవితం ఉండేలా చూస్తాను" అన్న ఒకే ఒక్క నా మాట విశ్వాసంతో- నువ్వు నాతో వచ్చేసావు! నన్ను కావాలన్న నువ్వు ఆ తర్వాత "నాకిది కావాలి నాన్నా!" అని నీ కోసం నువ్వేదీ కోరలేదు.

నేనేదైనా నీకిచ్చినా "అన్నీ కృతికే" అంటూ ఇచ్చేసేదానివి- "ఇప్పుడైనా ఏదైనా నన్ను నీ కోసం ఇవ్వనీ! ఏదైనా అడుగు..." అన్నాడు.

"నాకు రెండు ఆణిముత్యాలనిచ్చావు. నా బంగారాన్ని మించిన బంగారం ఉండనే ఉండదు నాన్నా! ఆమె నవ్వంత మెరుపు పసిడికైనా సాధ్యమా? చెప్పు!" అన్నాను.

** ** **

మధ్య మధ్యలో పండు కోసం రెండు గుక్కలు పోస్తూ వున్నాడు కార్తీక్.కృతి మధ్యమధ్యలో రాత్రుళ్లు నన్ను వచ్చి చూసుకుంటూనే ఉంది.

** ** **

మర్నాడు ఏ ద్రవమూ నోటిలోకి వెళ్లటం లేదు- క్రిందకే జారిపోతోంది ఒకటికి పక్కమీదే అయిపోతోంది- అయినా తడికి కూడా తెలివి రాలేదు- నేప్పీ పేడ్స్ కట్టారు- పక్క మార్చి ప్లాస్టిక్ పరుపు వేసారు. దత్తుడు, కోడలు నా కాళ్లు రాస్తూ వున్నారు. మనవలు, కృతి నా నోటిలో ఏదో ఒకటి పోయడానికి తాపత్రయపడుతూనే వున్నారు.

కార్తీక్ స్నేహితులు, నా స్నేహితులు అందరూ వచ్చారు. ఎవరినీ కళ్లు తెరిచి పలకరించలేను- మైకంలో నేను- మధ్య మధ్యలో మాటలు- కార్తీక్ మాటలకు మాత్రం స్పందిస్తూ కళ్లు తెరుస్తున్నాను.

... ద్రవం పోసినా గొంతు పూడ్చుకుపోవడంతో లోనికి వెళ్లటం లేదు.

కృతి, దత్తుడు నా చేతులు పట్టుకున్నారు. నాకెవ్వరూ నావారుగా అన్పించటంలేదు- ఏదీ నా చెవుల్లోకి వెళ్లటం లేదు- స్పర్శతో వ్యక్తులను పసిగడుతున్నా ఎలాంటి ద్వేష, రాగాలు, మమకార, వికారాలు లేవు... ఎవ్వరి తిరస్కారాలు, చీదరింపులు మనసులో లేవు- ప్రేమలూ లేవు- పసిపాపంత నిర్మలంగా ఉంది మనసు.

ఈ జన్మంతా ధారపోసిన బంధాలు- ఆఖర్న వైరాగ్యాన్ని నింపాయి. నిజానికి మరపు ఏ గుండెకూ తెలీదు.

కానీ క్షమాగుణం ప్రతి గుండెకూ తెలుసు.

అమ్మ మనసుకు మరీనూ. అందుకే ఈ గాథ ప్రతి అమ్మదీ.

ఓ కృతి ఓ మైత్రి, ఓ సాధన... ఇలా కొనసాగుతూనే ఉంటుంది.

అమ్మ ఉన్నంతకాలం- ఊపిరున్నంతకాలం. ●